సాక్షి హైదరాబాద్

శనివారం । 10 । డిసెంబర్ । 2022





కార్యకర్తలు, పోలీసులతో కిక్కిరిసిన తెలంగాణ భవన్





తెలంగాణ తల్లి విగ్రహానికి కేసీఆర్ పుష్పాంజలి



టీఆర్‌ఎస్ టు బీఆర్‌ఎస్

జలదృశ్యంలో టీఆర్‌ఎస్

ప్రాంతం: ట్యాంక్‌బండ్ దగ్గర, వేదిక: జలదృశ్యం
తేదీ: 27 ఏప్రిల్ 2001,
సందర్భం: టీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావం

తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్

ప్రాంతం: బంజారాహిల్స్, వేదిక: తెలంగాణ భవన్
తేదీ: 9 డిసెంబర్ 2022
సందర్భం: భారత రాష్ట్రసమితి (బీఆర్‌ఎస్) పార్టీ ఏర్పాటు

- ఆవిర్భావం నుంచి ఎన్నెన్నో మలుపులు.. మరెన్నో విజయాలు

సాక్షి, సిటీబ్యూరో:

రాష్ట్రంలోని అవసరాల కోసం.. ప్రాంతీయ సమస్యల పరిష్కారం కోసం ఆవిర్భవించిన ఒక పార్టీ 21 సంవత్సరాల సమయంలో జాతీయస్థాయి కెదగడం. రెండు సంఘటనలకూ హైదరాబాద్ మహానగరమే వేదిక కావడం విశేషం. టీఆర్‌ఎస్ పార్టీ ఏర్పాటయ్యాక జరిగిన ఉద్యమాలు.. ఉప్పెనలా ఎగసిపడ్డ ఆందోళనలు..ఆవిష్కృతమైన పోరు దృశ్యాలు కోకొల్లలు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి హుస్సేన్ సాగర్ దాకా ఎన్నెన్ని అపురూప ఘటనలకో సాక్షీభూతం ఈ నగరం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక ప్రాంతీయ పార్టీగా పురుడు పోసుకొని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన ఎనిమిదిన్నరేళ్లలో జాతీయపార్టీగా అవతరించడం సాధారణ విషయమేం కాదు. రెండు సంఘటనలకూ వేదిక హైదరాబాద్ భాగ్యనగరమే. రెండు పార్టీల ఏర్పాటు ప్రాంతాలు నగరంలోని ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోనే ఉండటం యాదృచ్ఛికమే కావచ్చు.

అంచెలంచెలుగా..

2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆతర్వాత



లంబాడా మహిళల సందడి

2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ టీఆర్‌ఎస్ ప్రభుత్వమే ఏర్పాటైంది. ఇక వచ్చే సంవత్సరం జరగబోయే ఎన్నికల్లో టీఆర్‌ఎస్ స్థానే బీఆర్‌ఎస్‌గా ఎన్నికల కదనరంగంలోకి దూకనుంది.

పొత్తులు.. ఎత్తులు, పైఎత్తులు

నీళ్లు, నిధులు, నియామకాలు స్లోగన్‌తో ఆవిర్భవించిన టీఆర్‌ఎస్ సమయాన్ని బట్టి ఆయా పార్టీలతో జత కట్టింది. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ఎత్తుపల్లాలు చవి చూసింది. అంతిమంగా తనకెవరూ సాటి లేరనే విధంగా అసెంబ్లీలో అత్యధిక స్థానాలే కాక, నగరంలోనూ దాదాపుగా ప్రతిపక్ష పార్టీ అనేదే లేకుండా చేయగలిగింది. సమయం, సందర్భాల్ని బట్టి కాంగ్రెస్, తెలుగుదేశం, కమ్యూనిస్టులతోనూ కలిసి పయనం సాగించింది. అలాగే బీజేపీతో కయ్యానికైనా సై అంటూ ఆ పార్టీ సంగతి జాతీయస్థాయిలోనే చూసుకుంటామనే వరకు వెళ్లింది.

విజయ పరంపర..

2014 జూన్‌లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక టీఆర్‌ఎస్‌కు ఓటమి అనేది లేకుండా పోయింది. అటు అసెంబ్లీ ఎన్నికల్లో కానీ, ఇటు నగరపాలక సంస్థ ఎన్నికల్లో కానీ విజయబావుటాలే ఎగుర వేసింది.

పార్టీలకూ అయస్కాంతంలా..

2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన కేపీ వివేకానంద్(కుత్బుల్లాపూర్), మాధవరం కృష్ణారావు(కూకట్‌పల్లి), తీగల కృష్ణారెడ్డి(మహేశ్వరం), మంచిరెడ్డి కిషన్‌రెడ్డి(ఇబ్రహీంపట్నం)టి.ప్రకాశ్‌గౌడ్(రాజేంద్రనగర్), ఆరెకపూడి గాంధీ(శేరిలింగంపల్లి), మాగంటి గోపీనాథ్(జూబ్లీహిల్స్),తలసాని శ్రీనివాస్ యాదవ్ (సనత్‌నగర్), జి.సాయన్న(కంటోన్మెంట్)లు అనంతరం టీఆర్‌ఎస్‌లో చేరారు. అలాగే 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి (ఎల్‌బీనగర్), పి. సబితా ఇంద్రారెడ్డి(మహేశ్వరం)లు సైతం తదనంతం టీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇతర పార్టీల నుంచి టీఆర్‌ఎస్‌లో చేరాక టిక్కెట్లు పొందిన ముఠాగోపాల్ (ముషీరాబాద్), కాలే రు వెంకటేశ్ (అంబర్‌పేట), దానం నాగేందర్(ఖైరతాబాద్) వంటి వారు గులాబీ ఎమ్మెల్యేలుగా గెలిచారు.

కార్పొరేషన్ కైవసం..

కోటిమందికి పైగా ప్రజలకు సేవలందిస్తున్న హైదరాబాద్ మహానగరపాలక సంస్థ(జీహెచ్ఎంసీ)లో సైతం తెలంగాణ ఏర్పాటు తర్వాత మరో పార్టీ ఆధిక్యత సాధించలేకపోయింది. 2016లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో 150 స్థానాలకుగాను ఏకంగా 99 సీట్లు సాధించి, ఒంటరిగానే మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. 2020 డిసెంబర్‌లో జరిగిన బల్దియా ఎన్నికల్లో కొన్ని సీట్లు తగ్గినప్పటికీ, ఒంటరిగానే మేయర్ పదవిని దక్కించుకుంది.

నగరంపై ముద్ర..

టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. విశ్వనగరంగా తీర్చిదిద్దే క్రమంలో గతంలో అన్ని ప్రభుత్వాల హయాంలో లేనన్ని ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, తీగల వంతెనలు వంటివి కేవలం ఎనిమిదిన్నరేళ్ల కాలంలో ఈ ప్రభుత్వ హయాంలోనే అందుబాటులోకి తెచ్చారు. ఇంకా ఎన్నో అందుబాటులోకి రానున్నాయి. అంతే కాదు. ఐటీరంగంలో మిగతా నగరాలతో పరుగులు పెడుతూ పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నారు. ఇప్పటికే గ్రీన్‌సిటీగా హైదరాబాద్ గుర్తింపు పొందడమే కాక, ఈ-రేసింగ్ వంటి వాటి నిర్వహణతోనూ ప్రపంచ పటంలోనే హైదరాబాద్‌ను ప్రత్యేక నగరంగా తీర్చిదిద్దే కార్యకలాపాలు చేపట్టడం తెలిసిందే.





టీఆర్‌ఎస్ భవన్ వద్ద కార్యకర్తల కోలాహలం

ఆ దేశాల వారి కన్నా హైదరాబాదీలే మిన్న

- కితాబిచ్చిన ఫార్ములా ఈ రేసింగ్ ప్రతినిధులు



అభివృద్ధి చెందిన దేశాల్లో నిర్వహించే రేస్‌లు చూడటానికి వచ్చే సందర్శకులు, అభిమానుల ప్రవర్తనకు, హైదరాబాదీల క్రమశిక్షణకు పొంతన లేదని ఫార్ములా ఈ.రేసింగ్ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. రేస్ జరిగే సమయంలో అక్కడి వారి ప్రవర్తన ఆందోళనకరంగా ఉంటుందని, అయితే ఇక్కడి వాతావరణం మాత్రం ఆహ్లాదకరంగా ఉందని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ట్రయల్ రన్ నేపథ్యంలో దీన్ని గుర్తించామన్నారు. ఫిబ్రవరి 11 నుంచి ఎన్టీఆర్ మార్గ్‌లో ఫార్ములా ఈ రేసింగ్స్ జరుగనున్నాయి. వీటి నేపథ్యంలో తీసుకోవాల్సిన బందోబస్తు, భద్రతా ఏర్పాట్లపై చర్చించేందుకు సెక్యూరిటీ డైరెక్టర్ స్కాట్ యాండర్సన్ నేతృత్వంలోని బృందం శుక్రవారం కొత్వాల్ సీవీ ఆనంద్‌తో భేటీ అయింది. బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో జరిగిన ఈ సమావేశానికి ఇరు పక్షాలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వం సహకారంతో ఎఫ్ఐఏ నిర్వహిస్తున్న ఈ రేసింగ్స్ తిలకించేందుకు గరిష్టంగా 35 వేల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపులు, సందర్శకుల తాకిడి నిర్వహణ తదితర అంశాలకు సంబంధించిన ప్రణాళికలపై చర్చించారు.

కార్ రేసింగ్‌కు సై

నేడు, రేపు మరోసారి కార్ రేసింగ్ లీగ్

- నగరానికి చేరుకున్న రేసింగ్ కార్లు
- నెక్లెస్‌రోడ్డు స్ట్రీట్ సర్క్యూట్ వద్ద సర్వం సన్నద్ధం
- ఈ సారి మరింత పటిష్టంగా ఏర్పాట్లు
- ట్రాఫిక్ మళ్లింపుతో వాహనదారులకు చుక్కలు...



సాక్షి, సిటీబ్యూరో: సాగరతీరం మరోసారి ఉత్కంఠ భరితమైన కార్ రేసింగ్‌కు సన్నద్ధమైంది. గత నెలలో సాంకేతికంగా ఎలాంటి పోటీలు లేకుండానే ముగిసిన రేసింగ్‌ను ఈ సారి పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. శని, ఆదివారాలు జరుగనున్న ఈ పోటీల కోసం రేసింగ్ కార్లు మరోసారి నగరానికి చేరుకున్నాయి. నెక్లెస్ రోడ్డులోని 2.8 కిలోమీటర్‌ల స్ట్రీట్ సర్క్యూట్‌లో పరుగులు తీసేందుకు రెడీగా ఉన్నాయి. వచ్చే ఫిబ్రవరిలో జరుగనున్న ఫార్ములా-ఈ పోటీలకు సన్నాహకంగా ఈ ట్రయల్స్ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. నవంబర్‌లో జరిగిన ప్రమాదం, బ్రేక్‌డౌన్స్ కారణంగా పోటీలు లేకుండానే ట్రయల్స్‌కే కార్ రేసింగ్ పరిమితమైంది. కన్ను మూసి తెరిచే లోపు వాయువేగంతో రయ్ మంటూ దూసుకుపోయిన కార్లు సందర్శకులకు కనువిందు చేశాయి. ఈ పోటీల నిర్వహణ కోసం హెచ్ఎండీఏ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ట్రాక్‌ను మరోసారి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. పోటీలను వీక్షించేందుకు అనుగుణంగా నెక్లెస్‌రోడ్డులో గ్యాలరీలను సిద్ధం చేశారు. 12 రేసింగ్ కార్లు పాల్గొననున్నాయి. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, తదితర నగరాలతో పాటు విదేశాలకు చెందిన రేసర్లు కూడా ఈ పోటీల్లో పాల్గొననున్నారు.రేసర్లు, నిపుణులు, నిర్వహణ యంత్రాంగంతో పాటు, వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది నగరానికి చేరుకున్నారు.

ట్రాఫిక్ నరకం..

ఇండియన్ రేసింగ్ లీగ్ దృష్ట్యా శుక్రవారం నుంచే నెక్లెస్‌రోడ్డు మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. మింట్ కాపౌండ్ నుంచి ఖైరతాబాద్ మార్గంలో వాహనాలను అనుమతించారు. దీంతో భారీ ఎత్తున వాహనాలు ఈ మార్గంలోకి ప్రవేశించడంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. గంటల తరబడి రోడ్లపైన పడిగాపులు కాయాల్సి రావడంతో వాహనదారులు నరకం చవి చూశారు. ఖైరతాబాద్ నుంచి నెక్లెస్‌రోడ్డు వెళ్లే వాహనాలను లక్డీకాపూల్ వైపు మళ్లించారు. అటు మహాగణపతి వైపు నుంచి, ఇటు ఖైరతాబాద్ నుంచి వెళ్లే వాహనాలతో ప్రధాన రహదారి స్తంభించింది. లోయర్ ట్యాంక్‌బండ్, తెలుగుతల్లి ఫ్లై ఓవర్, తదితర రూట్లలోనూ గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించింది. మరో రెండు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది.

రేసింగ్ రయ్....

హైదరాబాద్‌కు చెందిన బ్లాక్‌బర్డ్స్ (రేసర్ల టీమ్) ఢిల్లీకి చెందిన స్పీడ్ డిమాన్స్, బెంగళూరుకు చెందిన స్పీడ్‌స్టర్స్, చెన్నై టీమ్ టర్బోరైడర్స్, గోవా ఏసెస్ బృందాలు ఈ పోటీల్లో నెక్లెస్‌రోడ్డు స్ట్రీట్ సర్క్యూట్‌పై దూసుకెళ్లనున్నాయి. మోటర్ స్పోర్ట్స్ అభిమానులను విశేషంగా ఆకట్టుకోనున్న ఈ పోటీల్లో నగరానికి చెందిన రేసర్లు కూడా పాల్గొననున్నారు. స్విస్ ఇండియన్ ప్రొఫెషనల్ పోర్షే ఫ్యాక్టరీ డ్రైవర్ నీల్ జానీ, ఆస్టన్ మార్టిన్ రేసింగ్ అకాడమీ డ్రైవర్ అఖిల్ రవీంద్రలతోపాటు ఫిమేల్ ఎఫ్-4 రేసింగ్ డ్రైవర్ లోలా లోవిన్ ఫోసీ కూడా పాల్గొననున్నారు. ఈ పోటీలను వీక్షించేందుకు ఈ సారి ప్రేక్షకులు, మోటార్ స్పోర్ట్స్ అభిమానులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నట్లు భారతీయ మోటర్ స్పోర్ట్స్ కంపెనీ, రేసింగ్ ప్రమోషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్‌పీపీఎల్)వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ పోటీల్లో మొత్తం 24 మంది విదేశీ, భారతీయ రైడర్లు పాల్గొననున్నారు.

అదుపులో దోపిడీ దొంగలు!

ఇటీవల మహంకాళి, నారాయణగూడల్లో వరుస ఉదంతాలు

- నగరానికి చెందిన పాత నేరగాడి ముఠా పనిగా నిర్ధారణ
- పట్టుబడిన ముగ్గురు నిందితులు, పరారీలో మరో ఇద్దరు

హిమాయత్‌నగర్:

- గత నెల 22 రాత్రి: జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్ పరిధిలోని రోడ్ నెం.45 వద్ద నగల దుకాణం ఉద్యోగి కళ్లల్లో కారం కొట్టి బ్యాగ్ లాక్కుపోయారు.
- గత నెల 24 రాత్రి: నారాయణగూడ పోలీసుస్టేషన్ పరిధిలోని హిమాయత్‌నగర్ వై జంక్షన్ సమీపంలో బంగారం దుకాణం ఉద్యోగిపై దాడి చేసి 25 తులాల బంగారం గుంజుకుపోయారు.
- ఈ నెల 5 రాత్రి: మహంకాళి పోలీసుస్టేషన్ పరిధిలోని ఆర్‌పీ రోడ్‌లో ఉన్న ట్రాఫిక్ పోలీసుస్టేషన్ కొరియర్ బాయ్‌పై దాడి చేసిన ద్వయం రూ.27.12 లక్షలు విలువైన సొత్తు దోచేశారు.

కేవలం 14 రోజుల వ్యవధిలో జరిగిన ఈ మూడు ఉదంతాలకు ఒకే ముఠా కారణమని పోలీసులు తేల్చారు. సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలు, ఇతర సాంకేతిక ఆధారాలను బట్టి ముందుకు వెళ్లిన ప్రత్యేక బృందాలు కాలాపత్తర్ ప్రాంతానికి చెందిన ఓ పాత నేరగాడిని అదుపులోకి తీసుకున్నాయి. మరో నలుగురితో ముఠా కట్టిన ఇతగాడే ఈ దోపిడీలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. మొత్తం ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు పరారీలో ఉన్న ఇద్దరిని పట్టుకోవడంతో పాటు సొత్తు రికవరీ కోసం ప్రయత్నిస్తున్నారు.

రెక్కీ... కారం... కత్తి...

కాలాపత్తర్ ప్రాంతానికి చెందిన సదరు పాత నేరగాడికి ఘరానా నేరచరిత్రే ఉంది. ఒకప్పుడు చోరీలు, దోపిడీలు, స్నాచింగ్స్‌తో రెచ్చిపోయాడు. తాజాగా మరో ఇద్దరు పాత నేరగాళ్లు, ఇరువురు కొత్త వ్యక్తులతో ముఠా కట్టాడు. జ్యువెలరీ దుకాణాల పనితీరును పరిశీలించిన ఈ గ్యాంగ్ సొత్తుతో సంచరించే వారిని గుర్తించింది.

ఆ షాపుల్లో పని చేసే ఉద్యోగులతో పాటు నగలు తీసుకువెళ్లే కొరియర్ బాయ్స్‌ను టార్గెట్‌గా చేసుకుంది. వీరంతా ద్విచక్ర వాహనాల పైనే సంచరిస్తుండటంతో వీరికి కలిసి వచ్చింది. రెక్కీ చేయడం, వెంబడించడం, కళ్లల్లో కారం కొట్టి, కత్తులతో దాడి చేసి దోచుకోవడం మొదలెట్టారు. ఇద్దరు చొప్పున రెండు ద్విచక్ర వాహనాలపై టార్గెట్‌ను వెంబడించే వాళ్లు. ఓ ద్వయం నేరుగా నేరం చేయగా... మిగిలిన వాళ్లు సమీపంలో కాపు కాసే వాళ్లు. సూత్రధారి మాత్రం నేరుగా సీన్‌లోకి రాకుండా సహకరించేవాడు.



హిమాయత్‌నగర్‌లో సీసీ కెమెరాల్లో నిందితులు

ఆ రోజు రెండు చోట్ల రెక్కీ...

నగరంలో బంగారం వ్యాపారాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలనే వీళ్లు టార్గెట్‌గా చేసుకున్నారు. దోపిడీలు చోటు చేసుకున్న మూడు ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయిన ఫీడ్‌ను సేకరించిన పోలీసులు క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఫలితంగా నేరగాళ్ళ కదలికలకు సంబంధించిన పలు కీలకాంశాలు వెలుగులోకి వచ్చాయి. గత నెల 24 రాత్రి హిమాయత్‌నగర్ వద్ద పంజా విసరడానికి ముందు వీళ్లు రాంగోపాల్‌పేట, సికింద్రాబాద్, నారాయణగూడ పరిధుల్లో రెండుసార్లు చొప్పున రెక్కీ నిర్వహించారని తేలింది. సికింద్రాబాద్, రాంగోపాల్‌పేటల్లో దోపిడీలకు వీలుచిక్కలేదు. దీంతో హిమాయత్‌నగర్‌కు వచ్చి తమ 'పని' పూర్తి చేసుకున్నారు. పల్సర్ బైక్‌పై సంచరిస్తూ నేరాలు చేసిన వీళ్లు వీలున్నంత వరకు సీసీ కెమెరాల్లో రికార్డు కాకూడదని ప్రయత్నించారు.

గల్లీల నుంచి పారిపోయినా..

ఈ ప్రయత్నాల్లో భాగంగానే హిమాయత్‌నగర్‌లో నేరం చేసిన తరవాత స్ట్రీట్ నెం.9, అశోక్ నగర్, చిక్కడపల్లి, కవాడిగూడ, మారియట్ హోటల్, కిమ్స్ ఆసుపత్రి మీదుగా పరారయ్యారు. అట్నుంచి నుంచి మెట్టుగూడ మీదుగా వెళ్లారు. ప్రధాన రహదారులు, జంక్షన్లలో ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు కాకుండా తప్పించుకున్నారు. అయితే మిగిలిన చోట్ల ఉన్న కెమెరాల్లో నమోదైన ఫీడ్‌తో వీరి గుట్టు వీడింది. ఈ ముఠాను పట్టుకున్న పోలీసులు పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నారు. వరుస పెట్టి పంజా విసిరిన వీళ్లు మొత్తం ఎన్ని నేరాలు చేశారు? ఎక్కడెక్కడ నమోదయ్యాయి? అనే అంశాలను ఆరా తీస్తున్నారు. వీరిపై కొన్ని నాన్ బెయిలబుల్ వారెంట్లు కూడా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేరగాళ్లను పోలీసులు ఒకటిరెండు రోజుల్లో అరెస్టు ప్రకటించే అవకాశం ఉంది.



కుస్తీ (రెజ్లింగ్) పోటీలు శుక్రవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. రంగారెడ్డి జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ కేసరి టైటిల్ రెజ్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. మొత్తం 309 మంది తమ పేర్లను నమోదు చేసుకోవడంతో ఆదివారం వరకు పోటీలు జరగనున్నాయి. – మణికొండ



సేవ్ ఉస్మానియా..



ఉస్మానియా ఆస్పత్రికి నూతన భవన నిర్మాణం చేపట్టాలని ఉస్మానియా మెడికల్ కళాశాల అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వీరేశం, సెక్రటరీ డాక్టర్ కృష్ణమూర్తి, అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉస్మానియా ఆస్పత్రి పాతభవనం నుంచి కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి దాదాపు 9 ఏళ్లు అవుతున్నా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయడం లేదని అన్నారు. – అఫ్జల్‌గంజ్

కీచక తండ్రి

- రెండేళ్లుగా కుమార్తెకు లైంగిక వేధింపులు
- స్కూల్‌లో షీ టీమ్స్ అవగాహన కార్యక్రమంలో బాధితురాలి వెల్లడి
- నాలుగు వారాల్లో 111 ఆకతాయిల అరెస్టు

నాగోలు: కుమార్తెపై కన్న తండ్రి లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఘటన కుషాయిగూడలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. గత నెల 27 కాప్రా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీటీమ్స్ పోలీసులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ , ఈవ్ టీజింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశం అనంతరం అదే స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న బాలిక తండ్రి లైంగిక వేధింపుల గుర్తించి షీ టీమ్స్ దృష్టికి తీసుకెళ్లింది. తన తల్లి కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతుందని ఆమెకు నిద్ర కోసం మాత్రలు ఇచ్చేవారని తెలిపింది. ఆమె నిద్రలోకి వెళ్లగానే తండ్రి ప్రశాంత్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడేవాడని తెలిపింది. రెండేళ్లుగా వేధింపులకు గురి చేస్తున్న అతను ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని బెదిరించేవాడని చెప్పింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కుషాయిగూడ పోలీసులు నిందితుడు ప్రశాంత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


ఈవ్ టీజర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

మరో బాలికపై ట్యూషన్ మాస్టర్ వేధింపులు

ఎల్బీనగర్‌లో నివాసం ఉండే బాలిక 10 వ తరగతి చదువుతుంది.ఆమె అదే ప్రాంతానికి చెందిన మాచవరం వెంకట శ్రీకాంత్ కుమార్ వద్ద ట్యూషన్‌కు వెళ్లేది. బాలికతో సన్నిహితంగా ఉంటున్న అతను ఆమె ఫోన్ నంబర్ తీసుకుని అసభ్యకర మెసేజ్‌లు పంపేవాడు. తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని బలవంతం చేస్తున్నాడు. దీంతో బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

నిర్భయంగా ఫిర్యాదు చేయొచ్చు

మహిళలు ఎక్కడ వేధింపులకు గురైనా నిర్భయంగా షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయవచ్చని రాచకొండ షీ టీమ్స్ ఇన్‌ఛార్జి అదనపు డీసీపీ షేక్ సలీమా అన్నారు. శుక్రవారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయం వద్ద 111 మంది ఆకతాయికు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గత 4 వారాల్లో షీ టీమ్స్ 111 మంది ఈవ్ టీజర్లు పట్టుబడారు. వారిలో 41 మంది మేజర్లు, 70 మైనర్లు ఉన్నారు. పట్టుబడిన వారికి భూమిక విమెన్స్ కలెక్టివ్ నిపుణులు కౌన్సెలింగ్ ఇచ్చారు. మొత్తం 79 కేసుల్లో 29 ఎఫ్ఐఆర్, 28 పెట్టి కేసులు, 22 సాధారణ కౌన్సెలింగ్ ఉన్నాయి. మైనర్లకు సైకియాట్రిస్ట్ డాక్టర్ వాసవి కౌన్సెలింగ్ ఇచ్చారు.

వేధింపులకు గురైన మహిళలు డయల్ 100, వాట్సాప్ కంట్రోల్ నెం. 9490617111 ద్వారా ఫిర్యాదు చేయవచ్చని డీసీపీ సూచించారు.

నగరంలో నేడు

- లమాఖాన్ అమెచ్యూర్ రేడియో క్లబ్ ఆధ్వర్యంలో ఐదవ ఎడిషన్ వార్షిక కార్యక్రమం..
  వేదిక: ముఫాక్కామ్ జా ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజ్
- భారతీయ కళాసమితి ఆధ్వర్యంలో నక్షత్ర వీణ విభావరి..
  వేదిక: రవీంద్రభారతి
  సమయం: ఉదయం 9 గంటలు
- ఆర్.ఎస్ మ్యూజికల్స్ ఆధ్వర్యంలో 'మధురమైన రేయిలో' అలనాటి మధుర గీతాలాపన
  వేదిక: శ్రీత్యాగరాయగాన సభ, చిక్కడపల్లి
  సమయం: సాయంత్రం 4 గంటల నుంచి
- ఇండియన్ ఫొటో ఫెస్టివల్, టీఎస్ఆర్టీసీ సంయుక్త ఆధ్వర్యంలో ట్రావెలింగ్ ఫొటో గ్యాలరీ ఆవిష్కరణ..
  వేదిక: స్టేట్ ఆర్ట్ గ్యాలరీ, మాదాపూర్
  సమయం: మధ్యాహ్నం 12 గంటలు
- కందుర్తి ఆంజనేయులు శతజయంతి వేడుకలు..
  వేదిక: రవీంద్ర భారతి
  సమయం: ఉదయం 10 గంటలు
- గాంధీత్వ నుంచి హిందుత్వ దాకా పుస్తకావిష్కరణ కార్యక్రమం..
  వేదిక: సోమాజీగూడ ప్రెస్‌క్లబ్
  సమయం: ఉదయం 10:30 గంటలు

హస్త కళాకారుల సంక్షేమానికి కృషి

కవాడిగూడ: హస్తకళాకారుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారిని ప్రోత్సహించేందుకు గోల్కొండ హ్యాండీ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ పేరిట ప్రదర్శనలు నిర్వహిస్తుందని రాష్ట్ర గోల్కొండ హ్యాండీ క్రాఫ్ట్, హ్యాండ్లూమ్స్ సంస్థ చైర్మన్ బొల్లం సంపత్ కుమార్ గుప్తా అన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ, నాబార్డ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 18 వరకు గోల్కొండ హ్యాండీ క్రాఫ్ట్, హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామని దీనిని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శుక్రవారం సంస్థ ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, తెలంగాణ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ సీజీఎం చింతల సుశీలతో కలిసి ప్రారంభించారు. ఈ ప్రదర్శలో హస్తకళా వస్తువులను తక్కువ ధరకే అందుబాటులో ఉంటాయన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో సంపత్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ... హస్తకళాకారుల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం కళాకారులకు ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మేనేజర్ మసూద్ అలీ డిప్యూటీ మేనేజర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


స్టాళ్లను పరిశీలిస్తున్న చైర్మన్ సంపత్‌కుమార్ గుప్తా, ఎండీ బుద్ధ ప్రకాష్ తదితరులు

రామచంద్రభారతి విడుదల

చంచల్‌గూడ: ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో గత నెల రోజులుగా జైలులో ఉన్న నిందితులు రామచంద్రభారతి, నందకుమార్ గత గురువారం బెయిల్‌పై విడుదలయ్యారు. కాగా పెండింగ్ కేసులు ఉండటంతో అప్పుడే బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. నందకుమార్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు ఉండగా, రామచంద్రభారతిపై ఫోర్జరీ కేసులు ఉన్నాయి. ఇరువురిని కోర్టులో హాజరుపరచగా తిరిగి జైలుకు పంపారు. రామచంద్రభారతికి ఫోర్జరీ కేసులో బెయిల్ మంజూరు కావడంతో శుక్రవారం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు.

12న ఐటీఐ జాతీయ అప్రెంటిషిప్ మేళా

సాక్షి,సిటీబ్యూరో: ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థుల కోసం ఈ నెల 12న పటాన్‌చెరువులోని ప్రభుత్వ ఐటీఐ వేదికగా ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో పలు కంపెనీల నుంచి ప్రతినిధులు పాల్గొంటారని, ఆసక్తిగల అభ్యర్థులు www.apprenticeshipindia.gov.in లో నమోదు చేసుకుని, మేళాకు హాజరుకావాలని సూచించారు.

మాటల్లో చెప్పలేనిది ఒక్క ఫొటోతో చెప్పవచ్చు

నాంపల్లి: వేలమాటల్లో చెప్పలేని విషయాన్ని ఒక్క ఫొటోతో చెప్పవచ్చని తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో విద్యార్థులు నిర్వహించిన ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. చరిత్రలో ఒక్కో సంఘటనను ఒక్కో ఫొటో సజీవంగా చూపుతుందని ప్రశంసించారు. ఇలాంటి ఎగ్జిబిషన్‌ల ద్వారా భవిష్యత్తుకు ఫొటోగ్రాఫర్స్ పుట్టుకువస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాగాయని విమలక్క మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థుల ఫొటోగ్రాఫ్స్ ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఏవీ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.


చిత్రాలను తిలకిస్తున్న అల్లం నారాయణ, చిత్రంలో విమలక్క, ఆచార్య భట్టు రమేష్

చైనా మాంజాపై పంజా!

- నిఘా ముమ్మరం చేసిన టాస్క్‌ఫోర్స్ బృందాలు
- చార్మినార్ ప్రాంతంలోని దుకాణంపై దాడి
- ఒకరి అరెస్టు, రూ.12 లక్షల సరుకు స్వాధీనం



సాక్షి, సిటీబ్యూరో: సంక్రాంతి సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో నగరంలో అక్రమంగా సాగుతున్న చైనా మాంజా దందాపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. మనుషులతో పాటు పక్షులకు హానికారకమైన ఈ మాంజాపై నిషేధం ఉన్నా కొందరు వ్యాపారులు లాభాపేక్షతో అడ్డదారిలో అమ్ముతున్నారు. చార్మినార్ ప్రాంతంలోని బజాజ్ కైట్స్ నిర్వాహకుడు భగవాన్ దాస్ బజాజ్ ఈ దందా చేస్తున్నట్లు సమాచారం అందుకున్న దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. అతడిని అరెస్టు చేసి, రూ.12 లక్షల విలువైన చైనా మాంజా స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ చక్రవర్తి గుమ్మి ప్రకటించారు. మలక్‌పేటకు చెందిన భగవాన్ దాస్ ఏళ్లుగా ఈ దుకాణం నిర్వహిస్తున్నాడు. వివిధ బ్రాండ్ల పతంగులు, దారాలు, మాంజాలు అమ్ముడంతో పాటు కొన్నింటిని తానే స్వయంగా తయారు చేస్తున్నాడు. అయితే చైనా మాంజాకు ఉన్న డిమాండ్‌ను క్యాష్ చేసుకోవడానికి నిర్ణయించుకున్నాడు. ఢిల్లీకి చెందిన మాలీ రామ్‌తో ఒప్పందం కుదుర్చుకున్న ఇతడు అక్కడి నుంచి భారీగా చైనా మాంజా ఖరీదు చేసి తీసుకువచ్చాడు. సంక్రాంతి సీజన్ ముగిసే వరకు విక్రయించాలనే ఉద్దేశంతో రూ.12 లక్షల విలువైన సరుకు సిద్ధం చేసుకున్నాడు. దీనిపై దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర నేతృత్వంలో ఎస్సైలు కె.నర్సింహులు, ఎన్.శ్రీశైలం, వి.నరేందర్, షేక్ బుర్హాన్‌లతో కూడిన బృందం దాడి చేసింది. భగవాన్ దాస్‌తో పాటు సరుకునూ రెయిన్‌బజార్ పోలీసులకు అప్పగించింది. సంక్రాంతి ముగిసే వరకు నిఘా, దాడులు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వ్యాపారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని, నిషేధిత మాంజా విక్రయించవద్దని సూచిస్తున్నారు.

పోయిన డబ్బు దొరికింది

రూ. 7 లక్షలు బాధితుడికి అందించిన పోలీసులు



హయత్‌నగర్: బైక్‌పై వెళుతుండగా వాహనం నుంచి జారిపడిపోయిన నోట్ల కట్టలను పోలీసులు బాధితుడికి అందించిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి, ఆలియాబాద్‌కు చెందిన మీరంపల్లి అవినాష్, బుధవారం ఉదయం ఎల్లారెడ్డి కాలనీలో ఉంటున్న ప్రమోద్‌రెడ్డి వద్ద రరూ. 32 లక్షలు(మూడు బండిల్స్) తీసుకుని బ్యాగులో పెట్టుకుని బైక్‌పై రాగన్నగూడ బయలుదేరాడు. హయత్‌నగర్‌లోని జీ స్కూల్ సమీపంలోకి రాగానే ఓ మహిళ అవినాష్‌ను ఆపి మీ బ్యాగులో నుంచి ఏదో పార్సిల్ కింద పడిపోయిందని చెప్పింది. దీంతో అవినాష్ తన బ్యాగులో చూసుకోగా రూ.7 లక్షల బండిల్ కనిపించలేదు. అతను పోలీసులను ఆశ్రయించడంతో విచారణ చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో నోట్ల కట్టలు ఇస్త్రీ దుకాణం యజమానికి బండారి లక్ష్మణ్‌కు దొరికినట్లు గుర్తించారు. శుక్రవారం పోలీసుల సమక్షంలో లక్ష్మణ్ బాధితుడికి అందజేశాడు.

నగరం గజ గజ

- తుఫాన్‌తో నగరంలో పెరిగిన చలితీవ్రత
- 14.2 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు
- మరో మూడు రోజులు ఇలాగే..

సాక్షి, సిటీబ్యూరో: మాండౌస్ తుపాన్ కారణంగా వాతావరణంలో ఒక్కసారిగా అనూహ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయి. గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు బాగా పడిపోయాయి. దీంతో గత రెండు రోజులుగా చల్లటి గాలులు వీస్తున్నాయి. చలి తీవ్రత పెరిగింది. సాయంత్రం ఆరింటి నుంచే నగరవాసులను చలి వణికిస్తోంది. రాత్రి ఎనిమిది దాటితే నగరవాసులు ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. మరోవైపు ఉదయం పూట వాతావరణం బాగా మబ్బుపట్టి చల్లటి గాలులు వీయడంతో ఉదయం 8 దాటితే తప్ప బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. మార్నింగ్ వాక్‌కు వెళ్లేవారు సైతం వెనుకడుగువేస్తున్నారు. శుక్రవారం 14.2 డిగ్రీల కనిష్టస్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోయినట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. చలి తీవ్రత దృష్ట్యా రాత్రి తొమ్మిదింటికే రోడ్లపైన వాహనాల రాకపోకలు తగ్గుముఖం పడుతున్నాయి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఆస్తమాతో బాధపడేవారు తెల్లవారు జామున బయటకు వెళ్లకపోవడమే మంచిదని వైద్యులు సూచించారు.

మరో మూడు రోజులు ఇలాగే...

వాయుగుండం కారణంగా మరో మూడు రోజుల పాటు వాతావరణం బాగా మబ్బుపట్టి, చల్లగాలులతో ఇబ్బందిగానే ఉండవచ్చునని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కూడా కురిసే అవకాశం ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో తెలుగు వర్సిటీ రిజిస్ట్రార్‌కు గాయాలు

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. మేనత్త మృతి చెందడంతో ఆమె కుటుంబసభ్యులను పరామర్శించేందుకు రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం హైదరాబాద్ నుంచి ప్రైవేట్ కారులో ఖమ్మం బయలుదేరారు. నల్గొండ జిల్లా, కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామం వద్ద వారు ప్రయాణిస్తున్న కారు హైవేపై ఆగి ఉన్న లారీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో రిజిస్ట్రార్‌తో పాటు మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం నకిరేకల్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నార్కెట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి మార్చారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి రిజిస్ట్రార్‌ను వీసీ ఆచార్య తంగెడ కిషన్‌రావు పరామర్శించారు.


రిజిస్ట్రార్‌ను పరామర్శిస్తున్న వీసీ ఆచార్య తంగెడ కిషన్‌రావు

సాక్షి హైదరాబాద్

ఆదివారం ၊ 10 ၊ సెప్టెంబర్ ၊ 2023









ఉత్సాహంగా అమెజాన్ రన్

'రన్ ఫర్ చేంజ్' నినాదంతో శనివారం పీపుల్స్ ప్లాజా వేదికగా నిర్వహించిన అమెజాన్ రన్‌లో ఔత్సాహికులు పాల్గొన్నారు. గివ్ ఇండియాతో కలిసి అమెజాన్ నిర్వహించిన 5 కిలోమీటర్ల రన్‌ను భారతీయ మోడల్, ఫిట్‌నెస్ ప్రేమికుడు మిలింద్ సోమన్ జెండా ఊపి ప్రారంభించారు. సమాజానికి తిరిగి ఇవ్వడంలో ఉజ్వల భవిష్యత్తును సృష్టించాలనే తమ మిషన్‌లో భాగంగానే రన్ ఫర్ చేంజ్ నినాదంతో రన్‌ను నిర్వహించినట్లు అమెజాన్ ఇండియా, ఏపీఏసీ హెడ్ అనితా కుమార్ తెలిపారు. - ఖైరతాబాద్



న్యూస్‌రీల్

సంప్రదాయ నగలంటే ఇష్టం: పరిణీతి చోప్రా



త్రితియా జ్యువెల్స్‌ను ప్రారంభిస్తున్న పరిణీతి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36లో నూతనంగా ఏర్పాటు చేసిన త్రితియా జ్యువెల్స్‌ను శనివారం బాలీవుడ్ నటి పరిణీతి చోప్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనకు ట్రెడిషనల్ నగలు అంటే ఎంతో ఇష్టమని వాటిని ధరించేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతుంటానని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు కాంతి దత్, ప్రీతమ్ జుల్కర్ తదితరులు పాల్గొన్నారు.

15న రెండో విడత డబుల్ బెడ్రూం ఇళ్ల లక్కీ డ్రా

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో డబుల్ బెడ్రూం ఇళ్ల రెండో విడత లబ్ధిదారుల ఎంపికకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 15న హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరగనుంది. నియోజకవర్గానికి 500 మంది చొప్పున జీహెచ్ఎంసీ పరిధిలోని 24 నియోజకవర్గాలకు కలిపి మొత్తం 13,300 మందిని ఎంపిక చేస్తామని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ర్యాండమైజేషన్ ద్వారా ఎంపికైన వారికి ఈ నెల 21న వేర్వేరు ప్రదేశాల్లో ఇళ్లను పంపిణీ చేస్తామని కలెక్టర్ వివరించారు.

నిమ్స్‌లో 'వాలెట్ పార్కింగ్'

లక్డీకాపూల్: నిమ్స్ ఆస్పత్రికి వచ్చే రోగుల వాహనాలను నిర్ణీత పార్కింగ్ స్థలాల్లో పార్క్ చేసేలా యాజమాన్యం చర్యలు చేపట్టింది. వాలెట్ పార్కింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందుకు ప్రత్యేకంగా ఇద్దరు డ్రైవర్లను నియమించింది. రోగులు అత్యవసర పరిస్థితుల్లో రోడ్డు పక్కనే వదిలిపెట్టే వాహనాలను తమ సిబ్బందే ఆయా పార్కింగ్ స్థలాల్లో పార్క్ చేసే విధంగా చర్యలు తీసుకున్నామని డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. లక్ష్మీ భాస్కర్ తెలిపారు. దీని వల్ల ప్రాంగణంలో ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్క్ చేయకుండా కట్టడి చేసినట్టు అవుతుందని, అదే సమయంలో రోగులకు ఇబ్బంది కలగకుండా వాలెట్ పార్కింగ్ సిస్టంను ప్రవేశపెట్టామన్నారు. నిమ్స్‌కు వచ్చే రోగులు, వారి సహాయకుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకునే ఈ తరహా సేవలను అందిస్తున్నామని, ఈ సదుపాయాన్ని సద్వినియోగపర్చుకోవాల్సిందిగా కోరారు. ఉచిత రవాణా సదుపాయానికి మరో రెండు ఈ- కార్లు అందుబాటులోకి రానున్నట్టు లక్ష్మీభాస్కర్ తెలిపారు.

16 నుంచి సూత్ర ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్



బంజారాహిల్స్: ఈ నెల 16 నుంచి 18 వరకు హెచ్ఐసీసీ నోవాటెల్ హోటల్‌లో సూత్ర ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం దీనికి సంబంధించిన సన్నాహక కార్యక్రమం బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని ఎస్‌వీఎం గ్రాండ్ హోటల్‌లో నిర్వహించారు. పలువురు ప్రఖ్యాత డిజైనర్లు రూపొందించిన దుస్తులు, ఆభరణాలను, మోడల్స్ ధరించి సందడి చేశారు. దేశ వ్యాప్తంగా పేరెన్నికగన్న డిజైనర్లు తమ ఉత్పత్తులను ఈ ప్రదర్శనలో ఉంచుతారని వెల్లడించారు.

మూత తెరిస్తే మూడినట్టే!

మ్యాన్‌హోళ్లపై సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు

- మూత తెరిస్తే క్రిమినల్ కేసులు తప్పవు
- క్షేత్ర స్థాయిలో ఎమర్జెన్సీ టీంలు సిద్ధం
- ఎయిర్‌టెక్ మిషన్లు, ఇతర వాహనాలు
- పర్యవేక్షణ కోసం సెక్షన్‌కో ప్రత్యేక టీం
- చర్యలకు ఉపక్రమించిన జలమండలి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో భారీ వర్షాల నేపథ్యంలో రోడ్లపై ఉన్న మ్యాన్‌హోళ్లపై సేఫ్టీ గ్రిల్స్ బిగింపునకు జలమండలి చర్యలకు ఉపక్రమించింది. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా మ్యాన్‌హోళ్ల మూత తెరిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరికలు జారీ చేసింది. చిన్నపాటి వర్షాలకు డ్రైనేజీల పొంగిపొర్లడం.. ప్రమాదకరంగా మారుతున్న తరుణంలో ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఇప్పటికే లోతైన మ్యాన్‌హోళ్లతో పాటు సుమారు 22 వేలకు పైగా మ్యాన్‌హోళ్లపై సేఫ్టీ గ్రిల్స్ బిగించింది. ప్రధాన రహదారుల్లో ఉన్న వాటిని కవర్స్‌తో సీల్ చేసి, రెడ్ మార్కు ఏర్పాటు చేస్తోంది. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం (ఈఆర్టీ), మాన్‌సూన్ సేఫ్టీ టీం (ఎమ్మెస్టీ), సేఫ్టీ ప్రోటోకాల్ టీం (ఎస్పీటీ) వాహనాలను రంగంలోకి దింపింది. క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి రక్షణ పరికరాలు వినియోగించే విధంగా చర్యలు చేపడుతోంది. ప్రత్యేక టీంలకు కేటాయించిన వాహనాల్లో జనరేటర్‌తో కూడిన డీ వాటర్ మోటార్ ఏర్పాటు చేసింది. దీని సాయంతో వర్షపు నీటిని తొలగించనున్నారు. వీరంతా ఆయా ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండి పనిచేసే విధంగా ఆదేశాలు జారీ చేసింది. అధికంగా నీరు నిలిచే ప్రాంతాలపై ఈ టీంలు ప్రధానంగా దృష్టి సారించనున్నాయి. వీటితో పాటు ఎయిర్‌టెక్ మిషన్లు సైతం అందుబాటులో ఉంచడంతో పాటు మ్యాన్‌హోళ్ల నుంచి తీసిన వ్యర్థాల (సిల్ట్)ను ఎప్పటికప్పుడు తొలగించే విధంగా చర్యలు చేపట్టింది.

సీవరేజీ బృందం ఏర్పాటు..

మ్యాన్‌హోళ్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రతి సెక్షన్‌నుంచి సీవర్ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో ఒక సీవరేజీ బృందాన్ని జలమండలి ఏర్పాటు చేసింది. వీరు ఉదయాన్నే క్షేత్ర స్థాయిలో వారి పరిధిలోని ప్రాంతాలకు వెళ్లి పరిస్థితి పర్యవేక్షించే విధంగా ఆదేశాలు జారీ చేసింది. లీకేజీ, వాటర్ లాగింగ్ పాయింట్లను జీహెచ్ఎంసీ అధికారుల సమన్వయంతో ఎప్పటికప్పుడు క్లియర్ చేసేవిధంగా చర్యలకు తీసుకుంటుంది. ఎక్కడైనా మ్యాన్‌హోల్ మూత ధ్వంసమైనా, తెరిచి ఉంచినట్లు గమనించినా, ఇతర సమస్యలు, ఫిర్యాదులుంటే జలమండలి కస్టమర్ కేర్ నంబరు 155313కి ఫోన్‌చేసి సమాచారం అందించవచ్చని, వార్డు కార్యాలయాల్లోనూ నేరుగా సంప్రదించవచ్చని అధికారులు సూచిస్తున్నారు.





మ్యాన్‌హోళ్ల మూత తెరిస్తే నేరమే..

ఎవరైనా పౌరులు, అనధికార వ్యక్తులు అధికారుల అనుమతి లేకుండా మ్యాన్‌హోళ్లపై ఉన్న మూత తెరిచినా, తొలగించినా చట్ట ప్రకారం నేరమని జలమండలి అధికారులు పేర్కొంటున్నారు. నిబంధనలను అతిక్రమించి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయిస్తారు. నిందితులకు జరిమానా విధించడంతో పాటు కొన్ని సార్లు జైలు శిక్ష కూడా వేసే అవకాశముందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

కార్మికులకు శిక్షణ

పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది విధులు నిర్వర్తించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర సమయాల్లో ఎలా పనిచేయాలనే విషయంపై జలమండలి ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. భద్రతా పరికరాల పనితీరు, ఉపయోగించే విధానం, పారిశుద్ధ్య పనుల్లో తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలపై సూచనలు ఇవ్వడంతో పాటు పని ప్రదేశాల్లో ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు చేసే ప్రథమ చికిత్సపైనా అవగాహన కల్పిస్తుంది.

విస్తృత ప్రచారం

వర్షాకాలంలో సీవరేజీ నిర్వహణలో సాధారణ పౌరులు ఎలా ప్రవర్తించాలి? ఎలా నడుచుకోవాలి? అనే అంశాలపై జలమండలి విస్తృతంగా ప్రచారానికి శ్రీకారం చుట్టింది. స్థానిక కాలనీల సంఘాలు, ఎస్‌హెచ్ గ్రూపుల సభ్యులతో ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. టెలివిజన్, ఎక్స్(ట్విటర్), ఫేస్ బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తోంది.

కఠినంగా వ్యవహరిస్తాం..

జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్

ప్రస్తుత వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ పరిధిలోని మ్యాన్‌హోళ్లు, క్యాచ్‌పిట్ల మూతలు తెరిచే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కమిషనర్ రోనాల్డ్‌రాస్ హెచ్చరించారు. మ్యాన్ హోల్స్, క్యాచ్ పిట్స్ మూతలు తెరిచి ఉండటంతోనే ఇటీవల ప్రమాదాలు జరిగాయన్నారు. అనధికార వ్యక్తులు మ్యాన్ హోల్స్ మూతలను తెరిచినా, తొలగించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. మ్యాన్‌హోల్స్ వల్ల ఎక్కడైనా వరద నీటి సమస్యలు ఉంటే జీహెచ్ఎంసీ హెల్ప్‌లైన్ నంబర్ 040- 2111 1111ను సంప్రదించాలన్నారు.

గణపయ్యా.. కాస్త దిగి రావయ్యా!

వినాయక విగ్రహాల ధరలకు రెక్కలు

- గతేడాది కంటే ఈసారి 20% పెరుగుదల
- కనిష్టం రూ.45 వేలు.. గరిష్టం రూ.3 లక్షలు
- ధూల్‌పేట్, ఎల్‌బీనగర్, నాగోల్, మియాపూర్‌లలో విక్రయాలు
- చవితికి వైవిధ్యభరిత ప్రతిమలు సిద్ధం

సాక్షి, సిటీబ్యూరో: పది అడుగుల ఎత్తు వినాయక విగ్రహం ధర రూ.45 వేలు. ఇంకొంచెం ఆకర్షణీయంగా ఉంటే రూ.50 వేలు. 18 అడుగుల గణనాథుడు రూ.2 లక్షల పైనే ఉన్నాడు. ఇక 25 ఫీట్ల మూర్తిని మండపంలో ఏర్పాటు చేయాలంటే రూ.3 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకు చెల్లించి కొనుగోలు చేయాల్సిందే. ఈసారి గణనాథుడి విగ్రహాల ధరలకు రెక్కలొచ్చాయి. నగరంలోని అనేక చోట్ల విగ్రహాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నప్పటికీ ధరలు మాత్రం భగ్గుమంటున్నాయి. గత సంవత్సరంతో పోల్చితే ఈసారి 20 శాతం వరకు పెరిగినట్లు అంచనా. వినాయక విగ్రహాల తయారీ కోసం వినియోగించే వివిధ రకాల ముడిసరుకు ధరలు, రవాణా చార్జీలు పెరగడంతోనే విగ్రహాల ధరలు పెంచాల్సి వచ్చిందని ధూల్‌పేట్, నాగోల్, మియాపూర్ తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు చెబుతున్నారు. పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చే కళాకారులకు సైతం డిమాండ్ పెరిగిందని, ఎక్కువ మొత్తంలో చెల్లిస్తే తప్ప కళాకారులు లభించడం లేదని ధూల్‌పేట్‌కు చెందిన ఒక వ్యాపారి విస్మయం వ్యక్తం చేశారు.ఈ మేరకు గతేడాది కంటే ఈసారి కొంత మేరకు పెరిగాయన్నారు.

ఆకట్టుకునే ఆకృతుల్లో..

ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గణపతి నవరాత్రి ఉత్సవాల కోసం అందమైన వినాయక విగ్రహాలు ముస్తాబయ్యాయి. కొన్ని చోట్ల అమ్మకాలు కూడా ఆరంభమయ్యాయి. ఇంకా కొన్ని ప్రాంతాల్లో విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. హైదరాబాద్‌తో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ ప్రాంతాలకు చెందిన మండపాల నిర్వాహకులు హైదరాబాద్ నుంచే విగ్రహాలను తరలిస్తారు. ఈ మేరకు ధూల్‌పేట్, ఎల్‌బీనగర్, నాగోల్, ఉప్పల్, కార్ఖానా, కూకట్‌పల్లి, మియాపూర్ తదితర ప్రాంతాల్లో ప్రస్తుతం విభిన్న ఆకృతుల్లో బొజ్జ గణపయ్య మూర్తులు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి.

ధరలు ఎందుకు పెరిగాయంటే..

- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, కొబ్బరి పీచు, రంగులు తదితర వస్తువుల ధరలు పెరగడంతో విగ్రహాల ధరలకు రెక్కలొచ్చాయి. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి ముడిసరుకును హైదరాబాద్‌కు తరలించేందుకు రవాణా చార్జీలు కూడా భారీగా పెరిగాయి. దీంతో విగ్రహాల ధరలను పెంచవలసి వచ్చిందని హస్త కళాకారులు చెబుతున్నారు. సుమారు 500కు పైగా చిన్న, పెద్ద కార్ఖానాలు ఉన్న ధూల్‌పేట్‌లో రూ.500 ఖరీదైన విగ్రహాలు మొదలుకొని రూ.3.5 లక్షల ఖరీదు చేసే విగ్రహాలు కూడా అందుబాటులో ఉన్నాయి. వివిధ రకాల సైజులను బట్టి 15 శాతం నుంచి 20 శాతం వరకు ధరలు పెరిగాయి.
- గతేడాది రూ.40 వేలకు లభించిన విగ్రహాలు ఇప్పుడు రూ.45 వేలకు పెరిగాయి. 15 ఫీట్ల విగ్రహం రూ.85 వేల నుంచి 1.10 లక్షల వరకు పెరిగింది. ఎక్కువమంది కొనుగోలు చేసే 18 ఫీట్ల విగ్రహాల ధరలు కూడా రూ.2 లక్షలకు చేరాయి.
- చిన్న విగ్రహాలకు సైతం భారీ డిమాండ్ ఉంది. ధూల్‌పేట్‌లోని కళాకారులు ఇళ్లల్లో చిన్న విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. వీటికి రూ.500 నుంచి రూ.2500 వరకు ధరలు ఉన్నాయి. ఈ ధరలకు అనుగుణంగానే వివిధ సైజుల్లో ఉన్న విగ్రహాలను అమ్మకానికి సిద్ధం చేశారు.




కార్ఖానా ఖర్చులు పెరిగాయి: గణేష్



నగరంలో విగ్రహాల తయారీ కోసం కోల్‌కతా, పుణె, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల నుంచి కూడా కళాకారులను తీసుకొస్తాం. వాళ్లకు చెల్లించే జీతభత్యాలు ఈసారి బాగా పెరిగాయి. విగ్రహాల తయారీ పూర్తయ్యే వరకు భోజనం, వసతి కూడా కల్పించాలి. ముడిసరుకు ధరలు పెరగడం వల్ల కార్ఖానా నిర్వహణ ఖర్చులు కూడా పెరిగాయి.

పోటీ కూడా ఎక్కువే : రాకేష్



ఒకప్పుడు ధూల్‌పేట్ విగ్రహాలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు అన్ని చోట్లా విగ్రహాలను తయారు చేసి అమ్ముతున్నారు. షోలాపూర్ నుంచి తెచ్చి ఇక్కడ అమ్మకానికి పెట్టారు. రూ.లక్షలు ఖర్చు చేసి విగ్రహాలను తయారు చేస్తే ఈ పోటీ వల్ల ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. అలాగని నష్టానికి అమ్ముకోలేం కదా.

బస్సుల్లో గస్తీ

మెట్రోలలో ప్రయాణికుల్లా షీ టీమ్స్ పోలీసులు

- పోకిరీల చేష్టలను పసిగట్టేందుకు స్పెషల్ డెకాయ్
- ఈ ఏడాదిలో ఇప్పటివరకు 868 పిటిషన్ల స్వీకరణ
- వీటిలో 121 ఎఫ్ఐఆర్‌లు, 133 పెట్టీ కేసులు నమోదు
- 'సాక్షి'తో రాచకొండ మహిళా భద్రతా విభాగం డీసీపీ ఉషారాణి

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రైలు, బస్సుల్లో మహిళలకు ఆకతాయిల వేధింపులు ఎక్కువైపోయాయి. చేతులు, కాళ్లు తగిలించడం, మహిళల సీట్లలో కూర్చోవడం, వెకిలిచేష్టలు, సంజ్ఞలతో కామెంట్లు చేయడం వంటి ఘటనలు రాచకొండ పోలీసుల దృష్టికి వచ్చాయి. దీంతో షీ టీమ్స్ పోలీసులు ప్రత్యేక గస్తీ కార్యాచరణ రూపొందించారు. మెట్రో, బస్సులలో సాధారణ ప్రయాణికుల్లా ఎక్కి, పోకిరీల చేష్టలను పసిగట్టి, రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు స్పెషల్ డెకాయ్‌లకు శ్రీకారం చుట్టారు. ఉద్యోగుల ఎక్కువగా రాకపోకలు సాగించే వనస్థలిపురం, ఎల్బీనగర్, మల్కాజిగిరి వంటి ప్రాంతాలతో పాటు కాలేజీలు, స్కూళ్లు, ఫ్యాక్టరీలు, హాస్టళ్లు, కార్మికుల అడ్డాలలో ఈ డెకాయ్‌లు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు మెట్రో, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు షాపింగ్ మాల్స్, సినిమా హాళ్లు, బహిరంగ ప్రదేశాలలో మఫ్టీలో తిరుగుతూ నిరంతరం డెకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు.



87126 62662 హెల్ప్‌లైన్ నంబరు

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో మహిళలకు ఎదురయ్యే సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకొని తగిన పరిష్కారం అందించేందుకు రాచకొండలో కొత్తగా 87126 62662 హెల్ప్‌లైన్ నంబరు ఏర్పాటు చేశారు. ఇందులో ఒక కౌన్సిలర్ అందుబాటులో ఉంటారు. బాధితులకు భరోసా కల్పిస్తూ, వారి ఇబ్బందులను పరిష్కరించడం వీరి విధి.

ఈ ఏడాది 868 పిటిషన్లు..

ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా రాచకొండ షీ టీమ్స్‌కు 868 పిటిషన్లు వచ్చాయి. వీటిలో 121 ఎఫ్ఐఆర్‌లు, 133 ఈ-పెట్టీ కేసులను నమోదు చేశారు. 222 కౌన్సెలింగ్ సెషన్లు జరిగాయి. వీటిలో 911 మంది ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇవ్వగా.. ఇందులో 613 మంది మైనర్లు, 298 మంది మేజర్లున్నారు. గతంలో షీ టీమ్స్‌కు పట్టుబడిన ఆకతాయిలకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో నెలకు ఒకసారి కౌన్సెలింగ్ నిర్వహించేవారు. ఈ నెల నుంచి ప్రతి వారం కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు. మహిళలను వెంబడిస్తూ రెండోసారి పట్టుబడితే 354 (డి), కామెంట్లు, టీజింగ్, బెదిరింపులకు పాల్పడితే 509, 506 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నారు.

ప్రతి రోజూ అవగాహన కార్యక్రమాలు



రాచకొండలో ప్రస్తుతం 10 షీ టీమ్స్ బృందాలున్నాయి. ప్రతి టీమ్‌లో ఎస్ఐ/ఏఎస్ఐ ర్యాంకు అధికారితో పాటు నలుగురు కానిస్టేబుళ్లు ఉంటారు. వీరు ప్రతి రోజూ విద్యా సంస్థలు, షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్లు, ఫ్యాక్టరీలు, స్వయం సహాయక బృందాలు, గ్రామీణ ప్రాంతాలలో షీ టీమ్స్ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

- టి.ఉషారాణి, డీసీపీ, రాచకొండ మహిళా భద్రతా విభాగం

కరెంట్ షాక్‌తో దంపతుల మృతి

బండ్లగూడ గౌస్‌నగర్‌లో విషాదం

చాంద్రాయణగుట్ట: కరెంట్ షాక్‌తో దంపతులు మృతి చెందిన విషాద ఘటన బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌస్‌నగర్‌కు చెందిన షాకీరా బేగం(30), తన్వీర్ మజ్జా (36) దంపతులు. వీరికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. శనివారం ఉదయం మంచినీటి సరఫరా జరుగుతుండడంతో నల్లా మోటార్ స్విచ్ వేయడానికి షాకీరా బయటికి వచ్చింది. సంప్ ఐరన్ మూతపై నిల్చొని షాకీరా బేగం కరెంట్ స్విచ్ ఆన్ చేసింది. అప్పటికే విద్యుత్ తీగ తేలి ఐరన్ మూతకు అనుకుని ఉండడంతో షాక్‌కు గురైంది. ఇది గమనించిన భర్త తన్వీర్ ఆమెను కాపాడేందుకు వెళ్లడంతో ఆయనకు సైతం షాక్ కొట్టింది. దంపతులిద్దరూ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే అసువులు బాశారు. అలికిడితో నిద్ర లేచిన పిల్లలు.. తల్లిదండ్రులు విగత జీవులుగా పడి ఉండటాన్ని చూసి తీవ్రంగా రోదించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



షాకీరా బేగం, తన్వీర్ మజ్జా (ఫైల్)

పదే పదే ప్రతిపాదనలు..
పనులెప్పటికో మరి?

- హుస్సేన్‌సాగర్ సర్‌ప్లస్ నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణంపై నిర్లక్ష్యం
- ఇప్పటికే కొంతమేర పనులు..
- మళ్లీ ప్రతిపాదనలు చేయమన్న కమిషనర్ రోనాల్డ్‌రాస్



సాక్షి, సిటీబ్యూరో: హుస్సేన్‌సాగర్ సర్‌ప్లస్ నాలాకు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టే విషయమై ఇప్పటికీ సందిగ్ధత నెలకొంది. ఈ నిర్మాణం చేసేందుకు దాదాపు ఐదేళ్లక్రితం రూ.68.40 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. పనులు చేయలేదు. ఆ తర్వాత రెండేళ్ల క్రితం ఎస్ఎన్‌డీపీ కింద కొన్ని పనులు ప్రారంభించారు. అవి పూర్తి కాలేదు. మళ్లీ తాజాగా రిటైనింగ్ వాల్‌కు ప్రతిపాదనలు రూపొందించాల్సింగా జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ అధికారులను ఆదేశించారు. ఇటీవల హుస్సేన్‌సాగర్ సర్‌ప్లస్ నాలాలో పడి మహిళ మరణించిన ప్రాంతాన్ని స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో కలిసి పరిశీలించారు. నాలాకు ఇరువైపులా ఉన్న మారుతినగర్, దామోదర్ సంజీవయ్య నగర్‌తో పాటు గాంధీనగర్, అశోక్ నగర్ కాలనీ వరకు నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా నాలాకు రెండు వైపులా రిటర్నింగ్ వాల్ నిర్మించాలని, గతంలో ఉన్న రిటైనింగ్‌వాల్‌నే ఎత్తు పెంచాలని కోరగా, అందుకు స్పందిస్తూ కమిషనర్ వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. నాలా రిటర్నింగ్ వాల్ పైన జరిగిన నిర్మాణాలు, నాలాను ఆనుకొని నిర్మించిన ఇళ్లు, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించాలని, అంతే కాకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన బఫర్ స్థలం నిర్ణీత ప్రమాణాల మేరకు ఎంత ఉండాలో అందుకనుగుణంగా నివేదిక అందజేయాల్సిందిగా, లేక్స్,టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. దామోదర్ సంజీవయ్య నగర్ వైపు నాలాకు అనుకొని ఉన్న కొన్ని భవనాలు వరదకు శిథిలమై పునాదుల్లేకుండా ఉన్నాయని, వాటి పై కూడా దృష్టి సారించాలని సూచించారు. భారీ వర్షాలు కురిస్తే సదరు భవనాలు కూలిపోయే ప్రమాదం ఉన్నందున ఇప్పుడే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గాంధీనగర్ సబర్మతి బ్రిడ్జి వద్ద నాలాను పరిశీలిస్తుండగా ఎస్ఎన్‌డీపీ ద్వారా చేపట్టిన రిటైనింగ్ వాల్ పైన కొందరు ఇంటి యజమానులు అదనపు నిర్మాణాలు జరుపుతుండటం చూసి వాటిని వెంటనే తొలగించాలనడంతో అధికారులు తొలగించారు.

గందరగోళం..

సర్‌ప్లస్ నాలాపనులకు మళ్లీ ప్రతిపాదనలు రూపొందించాలనడంతో గందరగోళం నెలకొంది. వాస్తవానికి ఐదేళ్ల క్రితమే పనులు చేయాలనుకున్నారు. నాలకు రెండు వైపులా మూడేసి కిలోమీటర్ల వంతున మొత్తం ఆరు కిలోమీటర్ల మేర పనులు జరగాల్సి ఉండగా, జరగలేదు. రిటైనింగ్ వాల్‌బలంగా ఉన్న చోట కాకుండా మిగతా ప్రాంతాల్లో కొన్ని పనులు చేశారు. దాదాపు 2.5 కి.మీ.ల మేర చేశారు. అనంతరం ఎస్ఎన్‌డీపీ కింద చేపట్టారు. దాని అంచనా వ్యయం రూ.35.25 కోట్లు. వాటితో ఏం పనులు చేయాలనుకున్నారో తెలియదు. వాస్తవానికి రిటైనింగ్ వాల్ పటిష్టంగా, ప్రమాదాలు జరగకుండా నిర్మించాలంటే గతంలో ప్రతిపాదించిన రూ.60 కోట్లు సరిపోవని, మరో రూ.40 కోట్లు అవసరమని ఇంజినీరింగ్ నిపుణులు పేర్కొంటున్నారు. కమిషనర్ మళ్లీ తాజాగా ప్రతిపాదనలు రూపొందించమనడంతో పనులెప్పటికి పూర్తిచేయనున్నారో అంతుపట్టడం లేదు.

ఈనాటిది కాదీ వ్యథ

నగరంలో 2000 సంవత్సరంలో కురిసిన భారీ వర్షాలకు సర్‌ప్లస్ నాలా వెంబడి బస్తీలు నీటమునగడంతో నాలాను విస్తరించి ఆధునీకరించాలనుకున్నారు. కిర్లోస్కర్ కమిటీ నివేదిక మేరకు నాలాను ఎక్కువ వెడల్పునకు విస్తరించాలంటే ఎన్నో ఆస్తులు సేకరించాల్సి ఉండటంతో ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దాంతో పనులు చేపట్టలేదు. మరోమారు భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో సాగర్ సర్‌ప్లస్ నాలా విస్తరణ మళ్లీ చర్చనీయాంశమైంది. విస్తరణ పనులకు అధికారులు సిద్ధంకాగా, నాలా వెంబడి నివాసం ఉంటున్న ప్రజల నుంచి మళ్లీ అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ప్రజల విజ్ఞప్తి మేరకు నాలా విస్తరణ వల్ల ఎక్కువ ఆస్తులు కోల్పోకుండా చూడాలని అప్పట్లో బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, చింతల రామచంద్రారెడ్డి మునిసిపల్ మంత్రి కేటీఆర్‌ను కోరారు. దాంతో నాలాల వెంబడి ప్రజల ఆస్తులు ఎక్కువగా పోకుండా ఉండేందుకు బఫర్‌జోన్ వరకు ఆస్తుల్ని తొలగించకుండా, ముంపు సమస్యలు తగ్గేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. ఈనేపథ్యంలో నాలా పరిధి వరకే చర్యలు చేపట్టాలనుకున్నారు. అందులో భాగంగా నాలా పొడవునా రిటైనింగ్‌వాల్ నిర్మించాలని ప్రతిపాదించారు. కొంతమేర పనులు చేశారు. మళ్లీ ఇప్పుడు ప్రతిపాదనలంటున్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు మందడి ధర్మారెడ్డి ఇక లేరు



హిమాయత్‌నగర్: స్వాతంత్ర సమరయోధుడు మందడి ధర్మారెడ్డి (97) ఇక లేరు. శనివారం దిల్‌షుక్‌నగర్‌లోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచినట్లు ఆయన మనవరాలు శ్రావ్యరెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి గ్రామానికి చెందిన ధర్మారెడ్డి స్వాతంత్ర ఉద్యమం సమయంలో కీలకపాత్ర పోషించారు. జాతిపిత మహాత్మ గాంధీ నేతృత్వంలో జరిగిన శాంతియుత పోరాటాల్లో ధర్మారెడ్డి కూడా పాల్గొని ఉద్యమానికి నాంది పలికారు. రాష్ట్రంలో రజాకార్ల దౌర్జన్యాల సమయంలో ప్రజల పక్షాన నిలిచి వారికి భరోసా కల్పించారు. ధర్మారెడ్డికి భార్య జానకమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

భార్యతో గొడవ పడి.. క్షణికావేశంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



సాయికిరణ్ రెడ్డి (ఫైల్)

ఉప్పల్: కుటుంబ సమస్యలతో క్షణికావేశంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనగర్ కాలనీ ప్రాంతానికి చెందిన దండు సాయికిరణ్ రెడ్డి (23), మంచిర్యాల ప్రాంతానికి శ్రియారెడ్డిలు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. వీరు సంవత్సరంన్నర క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం కొద్దిరోజులకు ఇద్దరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. గొడవ జరిగినప్పుడల్లా భార్యాభర్తలు ఇద్దరు ఒకరినొకరు సూసైడ్ చేసుకుంటామంటూ బెదిరించుకునే వారు. కాగా శనివారం ఇద్దరికి సెలవు కావడంతో ఇంట్లోనే ఉన్నారు. షాపింగ్ విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన సాయికిరణ్ భార్య సమక్షంలోనే గదిలోకి వెళ్లి తలుపు పెట్టుకున్నాడు. బెదిరించడానికే అనుకున్న భార్య చాలా సేపు వరకు అతన్ని పలకరించలేదు. చివరకు అనుమానం వచ్చి తలుపు తట్టింది. ఎంత సేపటికి తలుపు తెరవక పోవడంతో మామ జంగారెడ్డి, స్థానికుల సహాయంతో తలుపులు బలవంతగా తెరిచి చూడగా..ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. వెంటనే కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టు మార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నయనానందం.. ఇషితారెడ్డి నాట్య అరంగేట్రం



ఇషితారెడ్డి

గోల్కొండ: అద్భుతమైన నృత్యంలో ఇషితారెడ్డి ఆహూతులను అలరించింది. ఇందుకు తారామతి బారాదరి ఇండోర్ ఆడిటోరియం వేదికైంది. డాక్టర్ రాధా రాజారెడ్డి శిష్యరికంలో నృత్య భంగిమలు నేర్చుకున్న ఇషితారెడ్డి అరంగేట్రం శనివారం అద్భుతంగా జరిగింది. కౌసల్యరెడ్డి, యామినిరెడ్డిల పర్యవేక్షణలో శాస్త్రీయ నృత్యంలో ఆరితేరిన ఇషితారెడ్డి ముందుగా గణపతి వందనంతో శ్రీకారం చుట్టి చివరిగా సరంగ నృత్యంతో తన నృత్య కౌశలాన్ని చాటుకుంది. ఇంతే కాకుండా మహా ప్రాణదీపం నృత్య రూపకం..కృష్ణ శబ్దం థిల్లాన నాట్యాలతో ఆకట్టుకుంది. కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన గావించారు.



కార్యక్రమానికి హాజరైన అయోధ్యరామిరెడ్డి తదితరులు

కారుతో ఢీకొట్టి..ఆపై గొంతుకోసి

జవహర్‌నగర్ పరిధిలో వ్యక్తి దారుణ హత్య



హత్యకు గురైన వేణు

జవహర్‌నగర్: ఓ వ్యక్తిని కారుతో ఢీ కొట్టి.. ఆపై గొంతుకోసి దారుణంగా హత్య చేసిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ లక్ష్మీనర్సింహ కాలనీలో నివసించే వేణు (41) రియల్ ఎస్టేట్ వ్యాపారి. భార్య, కుమార్తెతో కలిసి నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి వేణు తన ద్విచక్ర వాహనంపై చెన్నాపురం నుండి లక్ష్మీనర్సింహకాలనీకి వెళ్తుండగా చెన్నాపురం చెరువు వద్ద గుర్తు తెలియని దుండగులు వెనుక నుండి కారుతో వచ్చి ఢీ కొట్టారు. ఆపై కారులోంచి దుండగులు దిగి వేణుని దారుణంగా కత్తితో మెడను కోసి కారును అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. దీంతో వేణు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. భూవివాదాలు, పాత కక్షల కారణంగానే హత్య జరిగి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.